మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ
» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర
» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ..
బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.







గబ్బిలాలమడుగు జాతరకు సర్వం సిద్ధం



మండలంలోని గబ్బిలాలమడుగులో సమ్మక్క-సారలమ్మల గద్దెలు

గూడూరు, ఫిబ్రవరి 19 : మండలంలోని గబ్బిలాలమడుగు సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ కోసం జాతర కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడ 2001 నుంచి జాతర ప్రారంభమైంది. ఈ నెల 21న సారలమ్మను బొల్లెపల్లి నుంచి అర్రెం వంశీయులు, ప్రధాన పూజారి అర్రెం రమేష్, పూనెం విక్రమ్, పడిగె అశోక్‌లు గద్దెపైకి తీసుకువస్తారు. గోవిందరాజును మచ్చర్ల నుంచి దారం, అల్లెం వంశీయులు శ్రీలత, తాయమ్మతో పాటు పలువురు పూజారులు గద్దెపైకి తీసుకువస్తారు. పగిడిద్దరాజును బొల్లెపల్లి నుంచి అర్రెం వంశీయులు, 3వ నెంబర్ వడ్డెలు అల్లెం లక్ష్మి, ఈసం విజయ్ కుమార్, అర్రెం రమేష్‌లు గద్దెపైకి తీసుకువస్తారు. నాగులమ్మను దామరవంచ నుంచి పూజారులు సంయుక్తంగా గద్దెపైకి చేరుస్తారు. జంపన్నను బొల్లెపల్లి శివారు పాకాల వాగు ఒడ్డు నుంచి పూజారులందరి సమక్షంలో గద్దెపై ప్రతిష్ఠిస్తారు. 22న సమ్మక్కను మచ్చర్ల శివారు కుచ్చులగుట్ట అటవీ ప్రాంతం నుంచి సిద్దబోయిన వంశీయులు, ప్రధాన పూజారి కొట్టెం కృష్ణ, సనుప వంశీ, పెనక సాయి, కొట్టెం వెంకటేష్, కొట్టెం పద్మలు గద్దెపైకి చేరుస్తారు. 23న భక్తులకు వన దేవతల దర్శనం, 24న వనదేవతల వన ప్రవేశం జరుగుతుంది. జాతర కమిటీ ఆధ్వర్యంలో రహదారి పనులు పూర్తి చేశారు. జాతర ఆవరణలో లైటింగ్ ఏర్పాట్లు చేశారు.



జాతరలో సౌకర్యాలు కల్పించాలి

అర్రెం వీరస్వామి, జాతర కమిటీ అధ్యక్షుడు

గబ్బిలాలమడుగు సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి. ఈ జాతరకు సుమారు లక్ష మంది భక్తులు వనదేవతల దర్శనం కోసం వస్తారు. జాతర ప్రాంగణంలో సరైన వసతులు, సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డుతో పాటు విద్యుత్, పాకాల వాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి.

నామాలపాడులో నందిమేడారం జాతర

- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- రేపటి నుంచి జాతర షురూ

బయ్యారం, ఫిబ్రవరి 19 : బయ్యారం మండలం నామాలపాడులో ఈ నెల 21 నుంచి నంది మేడారం జాతర వైభవంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయిలోని మేడారం జాతరను తలపించేలా నిర్వాహకులు ఇక్కడ రెండేళ్లకోసారి జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు జిల్లాతో పాటు సమీప ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. ఆలయ పూజారి తుర్సం సాంబ లక్ష్మి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే జాతర మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తుర్సం సర్వేష్ తెలిపారు.

జాతర ఇలా ప్రారంభం..

- 21న కోయగూడెం నుంచి ఒడిబాలబియ్యంతో సారలమ్మ గద్దెకురాక
- 22న జంపన్న వాగులో పూజలు, పాలపొంగళ్లు, సమ్మక్క గజంశూల ధరించి చెలపెయ్యను ఆరగించుట, ఎదురలంక కుంకుమ భరిణెతో గద్దెకు ప్రవేశం, రాత్రి సమ్మక్క, పగిడిద్దరాజుల కల్యాణం
- 23న భక్తుల మొక్కుల చెల్లింపు కార్యక్రమాలు ఉండనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రవేశం కన్నుల పండువగా కొనసాగనుంది.



నామాలపాడులో ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ ఆలయం

భక్తుల కోలాహలం..

నామాలపాడుతో పాటు సమీప కొత్తపేట, గంధంపల్లి ప్రాంతాల్లో మూడు రోజుల పాటు జరిగే జాతరతో భక్తుల కోలాహలం నెలకొననుంది. జాతర సందర్భంగా ఆలయాల వద్ద పెద్ద ఎత్తున వ్యాపార సముదాయలు వెలవనున్నాయి. వేలాదిగా తరలివచ్చే భక్తులతో ఆలయాల వద్ద ఇల్లందు-మహబూబాబాద్ ప్రధాన రహదారులు కిక్కిరిసిపోనున్నాయి. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

మేడారం జాతరకు బస్సు సర్వీసు ప్రారంభం

కొత్తగూడ, ఫిబ్రవరి 19 : కొత్తగూడ మండల కేంద్రం నుంచి మేడారం జాతరకు బస్సు సర్వీసును సోమవారం నర్సంపేట ఆర్టీసీ డిపో డీఎం ప్రసన్నలక్ష్మి, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, మేడారం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ చంచ హైమావతి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. భక్తులు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.170 చార్జీలు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలు ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, సొసైటీ డైరెక్టర్లు చల్లా నారాయణరెడ్డి, సుంకరబోయిన మొగిలి, సర్పంచ్‌లు మల్లె రణధీర్, ఇర్ప రాజేశ్వర్, ఎంపీటీసీ హలావత్ సాలూకి సురేష్, మాజీ జడ్పీటీసీ మధుసూదన్ రెడ్డి, ఆర్టీసీ క్యాంపు ఇన్‌చార్జి ఓరుగంటి కొమ్మాలు, కండక్టర్ రూపిక సుమన్, స్థానికులు వేంపల్లి రమేష్ పాల్గొన్నారు.



కొత్తగూడలో బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం, నేతలు

అక్రమంగా ఎస్సారెస్పీ మట్టి తరలింపు

డోర్నకల్, ఫిబ్రవరి 19: ఎస్సారెస్పీ కాలువ మట్టిని అక్రమంగా తలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. డోర్నకల్ మండలం వెన్నారం శివారు గుండా వెళ్తున్న డీబీఎం-48 ప్రధాన కాలువకు చెందిన మట్టిని కొందరు వ్యక్తులు మిషన్‌లతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నప్పటికి అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయాన్ని కొందరు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి

- రాజయోగిని బ్రహ్మకుమారి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి సవిత

తొర్రూరు, ఫిబ్రవరి 19 : నేటి సమాజంలో ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుని భక్తి భావాన్ని చాటాలని బ్రహ్మకుమారీస్ వరంగల్ సబ్ జోన్ డైరెక్టర్ రాజయోగిని సవిత అన్నారు. తొర్రూరులో బ్రహ్మకుమారీస్ నూతన ఆశీర్వాద భవనాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం శాంతి, సంతోషం కోసం ఆధ్యాత్మిక క్రాంతి అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తొర్రూరు లాంటి వ్యాపార కేంద్రంలో ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలన్నారు. సమాజ సేవ చేసేందుకు ముందుండాలన్నారు. నేటి ఆధునిక యుగంలో ప్రజలు నూతన ఆవిష్కరణలకు అలవాటు పడి భక్తి భావాన్ని మర్చిపోతున్నారని, భక్తి భావం కలిగి ఉంటేనే భగవంతుడి ఆశీర్వాదం ఉంటుందన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు దాతలు సహకరించడం ఎంతో అభినందనీయమన్నారు. రూ.10 లక్షల విలువ గల భూమిని భవన నిర్మాణం కోసం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. స్థల దాత బోనగిరి శంకర్-జ్యోతి దంపతులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. అనంతరం బ్రహ్మకుమారీలకు, భక్తులకు బ్రహ్మ భోజనం అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్‌చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రాము, మూర్తి, సుధాకర్, బ్రహ్మకుమారి అనిత, కల్పన, 500 మంది బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

డీపీఆర్వోపై విచారణ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 19 : మహబూబాబాద్ జిల్లా ప్రజా సంబంధాల అధికారి(డీపీఆర్వో) కె.శ్రీనివాస్‌రావుపై సోమవారం సంబంధిత శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు విచారణ చేపట్టారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల విషయంలో అవకతవకలపై పలువురు జర్నలిస్టులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రజా సంబంధాల శాఖ డీడీ ప్రసాదరావు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో డీపీఆర్వోపై విచారణ చేపట్టారు. పలువురు జర్నలిస్టులు డీడీకి తమ అభిప్రాయాలను వెల్లడించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని డీడీ తెలిపారు.

రూ.7వేలు దాటిన పత్తి ధర

కేసముద్రం, ఫిబ్రవరి 19 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి ధర రూ.7వేలు దాటింది. మార్కెట్‌కు 34 మంది రైతులు 466 బస్తాల్లో 186 క్వింటాళ్ల పత్తి తీసుకురాగా ఈ-నామ్‌లో క్వింటాకు గరిష్ఠంగా రూ.7,139, కనిష్ఠంగా రూ.4,549, సగటున రూ.6,602 ధరల చొప్పున కొనుగోలు చేశారు. ఈ నెల 15 నాటి మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.6,791 ఉండగా రూ.7వేల మార్క్ దాటింది. సగటు ధర రూ.6,689 ఉండగా తాజాగా రూ.6,602 ఉండడం గమనార్హం.

పది విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

నర్సింహులపేట, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇర్రిలింగారెడ్డి సొంత ఖర్చులతో సోమవారం స్నాక్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ వార్షిక పరీక్షల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో లింగారెడ్డి సొంతంగా విద్యార్థులకు స్నాక్స్ అందజేయడం అభినందనీయమన్నారు.

మేడారం భక్తుల కోసం వైద్య శిబిరం



మహబూబాబాద్ ఆర్టీసీ డిపో వద్ద మెడికల్ క్యాంపులో భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమ్య

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 19 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మేడారం జాతర భక్తుల కోసం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి అంబరీష ఆదేశాల మేరకు ఈ నెల 25 వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య, ఆరోగ్య విస్తరణాధికారి వొబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ... మేడారం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శివప్రసాద్, వైద్య సిబ్బంది అరుణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 19: యువత ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని విశ్వహిందు పరిషత్ నాయకుడు మాలోతు రవీందర్ అన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ 394వ జయంతిని పురస్కరించుకుని సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... స్వరాష్ట్ర స్థాపన కోసం ఛత్రపతి శివాజీ ఎన్నో త్యాగాలు చేశారని చెప్పారు. ఆంగ్లేయులపై పోరాడేందుకు స్ఫూర్తి ప్రధాత ఛత్రపతి అని చెప్పారు. ప్రపంచానికి గెరిల్లా యుద్ధాన్ని పరిచయం చేసింది కూడా ఆయనే అని గుర్తు చేశారు. అలాంటి మహావీరుడిని స్ఫూర్తిగా తీసుకుని దేశ సంరక్షణ కోసం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బవిరిశెట్టి శ్రీనివాస్, మోసంగి మురళి, దిడ్డి మహేష్, మల్లం యశ్వంత్, చుక్కల నరేష్, శ్రీరంగం మురళి, శ్రీకాంత్, రాహుల్, రాజేష్, దార ఇందుభారతి పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో...

తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పూసల శ్రీమాన్ మట్లాడుతూ... ఛత్రపతి శివాజీ గొప్ప పోరాట యోధుడని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, కొలుపుల శంకర్, పైండ్ల రాజేష్, ఉపేందర్, రాజ్‌కుమార్, రాజు, నవీన్, గణేష్, సిద్దు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

- మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆయూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాకేశ్, గంట్ల మహిపాల్‌రెడ్డి, గంధసిరి కృష్ణ, రేఖ రమేశ్, కుదురుపాక విష్ణు, రఘురామ్, భూక్యా శ్రీను, గర్రెపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేటలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో గంధసిరి మహేష్, తప్పెట్ల ఉపేందర్, మధుసూదన్, ఆకుల లింగన్న, ఆకుల నరేష్, నాదారపు ఉపేందర్, సీమ సురేష్, తప్పెట్ల రమేష్, వీరబాబు, చిన్న వెంకన్న, రామన్న, తప్పెట్ల మహేష్, పుల్లూరు శివ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నేతలు

- పెద్దవంగర మండల కేంద్రంలో ఛత్రపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖేష్, వినోద్, శ్యామ్, అనుదీప్, యాకన్న, మహేంద్రాచారి, సోమేశ్వరాచారి, సుధీర్, రాకేష్, మహేష్, సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐలు

కొత్తగూడ, ఫిబ్రవరి 19 : కొత్తగూడ ఎస్సైగా దిలీప్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన నగేష్ బదిలీపై గూడూరుకు వెళ్లారు. గంగారం ఎస్సైగా పనిచేసిన దిలీప్ కొత్తగూడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై దిలీప్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

- గూడూరు : గూడూరు ఎస్సైగా సీహెచ్.నగేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడ ఎస్సైగా పనిచేసి గూడూరు ఎస్సైగా బదిలీపై వచ్చారు. గతంలో గూడూరులో ఎస్సైగా పనిచేసిన రాణాప్రతాప్ మహబూబాబాద్‌కు బదిలీఅయ్యారు. ఆయనస్థానంలో సీహెచ్.నగేష్ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా చేపట్టిన ఎస్సై నగేష్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 : భారతీయ జనతా పార్టీ మానుకోట జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వల్లభు వెంకటేశ్వర్లు, మేరెడ్డి సురేందర్, బానోత్ కృష్ణ, తోట సంపత్‌కుమార్, తుంపిళ్ల శ్రీనివాస్, వి.నాగయ్య శాస్త్రి, ప్రధాన కార్యదర్శులుగా మోసంగి మురళి, ధర్మారపు వెంకన్న, నాయిని ధర్మారెడ్డి, కార్యదర్శులుగా రామడుగు వెంకటాచారి, బానోత్ శ్రీను, మాధవపెద్ది విజయలక్ష్మి, కొలుపుల శంకర్, చిట్టిమల్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధిగా ధార ఇందుభారతి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పైండ్ల శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా గుగులోతు రాంబాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బొల్లంపల్లి విజయేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆలూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

యాదవులు విద్యలో రాణించాలి

డోర్నకల్, ఫిబ్రవరి 19: యాదవులు విద్యలో రాణిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్ యాదవ్ అన్నారు. డోర్నకల్‌లోని అశోక్ భవన్‌లో సోమవారం భారత యాదవ సమితి క్యాలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో సైతం యాదవులు రాణించి ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లావుల హరికృష్ణ, శివగణేష్, కోడి యాకయ్య, సకినాల కొమురయ్య, పచ్చిపాల రాంబాబు, పెంటయ్య సురేష్, నరేందర్, కొత్త రాములు, దాసరి శ్రీకాంత్, పచ్చిపాల సురేష్, మురళి, యాదవులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరిపై కేసు నమోదు

నర్సింహులపేట, ఫిబ్రవరి 19 : దాడి కేసులో ఒకరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జి.సతీష్ సోమవారం తెలిపారు. మండలంలోని పెద్దనాగారం గ్రామంలో జీపీ సిబ్బంది కొమ్ము వెంకన్న విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 17న గ్రామంలోని మిషన్ భగీరథ గేట్‌వాల్ తిప్పి ఇంటికి వస్తున్న క్రమంలో జిల్లోజు నాగేంద్రచారి తమ ఇంటికి నల్లానీళ్లు రాకపోవడానికి నీవే కారణమని ఇనుప రాడ్డుతో దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లో పాము కలకలం

కేసముద్రం, ఫిబ్రవరి 19 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి విక్రయించేందుకు వచ్చిన ఓ రైతు బైక్‌లోకి పాము చొరబడడంతో కలకలం రేపింది. రైతు తన బైక్‌ను నిలిపి ఉంచగా అందులోంచి అత్యంత విషపూరితమైన కట్లపాము బయటకు వస్తుండడాన్ని రైతులు గమనించి దగ్గరకు వచ్చారు. దీంతో పాము భయంతో తిరిగి బైక్‌లోకి వెళ్లిపోగా బయటకు రప్పించేందుకు పలు విధాలుగా ప్రయత్నించారు. అర్థగంట అనంతరం బైక్‌పై నీళ్లను పంపింగ్ చేసి బయటకు రప్పించాలని ప్రయత్నిస్తుండగా పాము బయటకు రావడంతో చంపివేశారు.

తాటిచెట్టుపై విద్యుదాఘాతం

- గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



చిన్నగూడూరు, ఫిబ్రవరి 19 : కుల వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన ఓ గీత కార్మికుడు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన గునిగంటి వీరన్న జీవనోపాధి నిమిత్తం మూడేళ్లుగా ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటున్నాడు. అక్కడ కుల వృత్తినే నిర్వహిస్తున్నాడు. సోమవారం ఘట్‌కేసర్ శివారులో రోజు లాగానే తాటిచెట్టు ఎక్కి తాటిమట్టను కొడుతున్న క్రమంలో తాటికమ్మ విరిగి విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన వీరన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చాకచక్యంగా తాటిచెట్టుపై నుంచి కిందకు దించి స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

నెల్లికుదురు, ఫిబ్రవరి 19: నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో అంబరీష సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కేసముద్రం, ఫిబ్రవరి 19: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 10 కళాశాలల్లో 21 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

మేడారంలో ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 19 : మేడారం జాతరకు భక్తులు ప్లాస్టిక్‌ను తీసుకువెళ్లకుండా ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని తొర్రూరు ఎంపీడీవో సలార్‌సాబ్ అన్నారు. తొర్రూరు మండలం మాటేడు ప్రత్యేకాధికారి, ఎంపీడీవో సలార్‌సాబ్, వెల్లికట్టె ప్రత్యేకాధికారి, ఎంపీవో ఎండీ గౌస్ గ్రామంలో కలియ తిరుగుతూ అవగాహన కల్పించి మాట్లాడారు. మేడారం జాతరకు వెళ్తున్న భక్తులు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాస్ వస్తువులు తీసుకువెళ్లవద్దని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులతో వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నగేష్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై విచారణ జరిపించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 19 : విద్యార్థినుల మరణాల పట్ల సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పంతం విజేందర్ అన్నారు. తొర్రూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో విద్యార్థినుల అకాల మరణాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట గురుకుల పాఠశాలలో అస్మిత, ఇంటర్మీడియట్ విద్యార్థిని వైష్ణవితో పాటు మరో విద్యార్థిని అకాల మరణం చెందిందని అన్నారు. గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకున్న ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శ్యామ్, సురేందర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పురుషోత్తం అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ పురుషోత్తం మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, అడిషనల్ డీఆర్‌డీఏ అధికారి సురేష్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమారత్నమాల, మమత, యుగంధర్, బొంద్యాలు, వేణుగోపాల్, శశికాంత్, మల్లేశం, రాజేందర్, నరహరి, రాంరెడ్డి, సుజిత్‌రెడ్డి, ఖాసీం, వీరు, సుమలత, సంతోష్ కుమార్, ఉపేందర్, సంతోష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను వదిలి వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానమా?

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 19: మహబూబాబాద్ మునిసిపాలిటీలో చైర్మన్‌ను వదిలేసి వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానమేంటని ముస్లిం మైనారిటీ పెద్దలు ఎస్కే.జావిద్, ఎస్కే.అబ్బాస్, సద్దాం, అఫ్జల్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్‌పై ఎందుకు వ్యతిరేక భావం కలిగింది... అవిశ్వాసం ఎందుకు పెట్టాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ముస్లింలకు రాకరాక వచ్చిన వైస్ చైర్మన్ పదవి నుంచి మైనారిటీ నేత ఫరీద్‌ను దించవద్దని కోరారు. వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని బలపర్చని సీపీఐ, ఇతర కౌన్సిలర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎండీ.గౌస్‌పాషా, మునీర్, రహెమత్ అలీ, ఖాజావలీ, ఫజల్, అజ్మీర్, సాజిద్, సలీమ్, రహెమాన్, యాకూబ్, ఫిరోజ్‌పాషా, సోహెల్, రిజ్వాన్, అప్సర్ పాల్గొన్నారు.

తవ్వకాల్లో బయల్పడిన పురాతన విగ్రహాలు



అయోధ్యపురంలో బయటపడ్డ నంది విగ్రహం

గూడూరు, ఫిబ్రవరి 19 : మండలంలోని అయోధ్యపురంలో 19వ శతాబ్దానికి చెందిన శివాలయం శిథిలావస్థలో ఉంది. గతంలో అక్కడ శివాలయం ఉండేదని స్థానికులు చెబుతుండేవారు. సోమవారం గ్రామస్తులు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తుండగా అక్కడ నంది, శివలింగం బయటపడగా, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నందనం కవితకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కవిత విగ్రహాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు విగ్రహాలకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఆపై ఆలయం ఉన్న చోట తిరిగి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, కంకటి ఉప్పలయ్య, గాదె ఆగారెడ్డి, బొల్లం సాంబమూర్తి, మాజీ సర్పంచ్ తులసీరాం నాయక్, ముక్తీశ్వర్‌గౌడ్, పొగాకు వెంకటేశ్వర్లు, గోపాల్, యాదగిరి, శ్రీధర్ పాల్గొన్నారు.

డీఎస్పీ తిరుపతిరావును కలిసిన టీడీపీ నేతలు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 19 : మహబూబాబాద్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిరుపతిరావును సోమవారం టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శరవయ్యను, మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నోముల రవీందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ, డి.వెంకటేష్‌నాయక్, బొమ్మ వెంకటేశ్వర్లు, అర్బన్ అధ్యక్షుడు పిట్టల రాము, సంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

డోర్నకల్, ఫిబ్రవరి 19 : డోర్నకల్ పట్టణంలో శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు మూడవ రోజుకు చేరాయి. సోమవారం ఉదయం ప్రబోధకి, నిత్యహోమ పారాయణాదులు, అభయాంజనేయ స్వామికి పంచామృత స్నపనము, ఉల్కల ఉత్సవం, ఎదుర్కోలు ఉత్సవం, నిత్యహవన పారాయణాదులు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ కైంకర్యపరులకు ఆశీర్వచనము, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండన్నను కోర్టులో హాజరు పర్చాలి : ఎన్డీ

కొత్తగూడ, ఫిబ్రవరి 19 : ఏజెన్సీ అటవీ ప్రాంతంలో, బయ్యారం అడవుల్లో పోలీసులు కూంబింగ్‌ను నిలిపివేయాలని, అరెస్ట్ చేసిన కొండన్నను వెంటనే కోర్టులో హాజరు పరచాలని ఎన్డీ జిల్లా నాయకుడు భూర్క వెంకటయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పోలీసులు అదనపు బలగాలతో ఏజెన్సీ ప్రాంతం, బయ్యారంలో తరచూ కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో ఏజెన్సీలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్డీ దళ సభ్యుడు కొండన్నను పోలీసులు అరెస్ట్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటూనే ప్రజా ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆగబోయిన నర్సక్క, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.శ్రీశైలం, ఎన్డీ డివిజన్ నాయకులు యాదగిరి యుగేందర్, దేవుళ్లపల్లి మగన్న, పోతుగంటి లక్ష్మయ్య, వెంకన్న, నారాయణరెడ్డి, రామచంద్రు, రమ, పీవైఎల్ నాయకుడు గొగ్గల రాంబాబు పాల్గొన్నారు.

వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ


తొర్రూరు, ఫిబ్రవరి 19 : సంక్షేమ హాస్టళ్ల వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో నారాయణ మూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే వార్డెన్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉండకపోవడం, మెనూ పాటించకుండా నాసిరకమైన భోజనంతో సరిపెడుతున్నారని తెలిపారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వార్డెన్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమంత్, చరణ్, మహేష్, సోని తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన నెహ్రూనాయక్

కురవి, ఫిబ్రవరి 19 : రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు మాలోతు నెహ్రూనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్యాలయంలో పూజా కార్యక్రమం అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మాలోతు నెహ్రూనాయక్



సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోని షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, రెస్టారెంట్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- - 13,000/-. సంప్రదించండి 8688072125
AJW-177957

PLOT FOR SALE
★ 305 Yards Ring Road Bit. 40 Lakhs South Facing, Between Reddypuram & Gunturpalli. Cont : 7893530678
AJW-177889

WANTED
★ Wanted PhotoShop Designer (2), DTP Operator (1), Video Editor (1), Lady Tele Callers (3). Cont : 7659099000, HNK
AJW-13915

KUDA LAYOUT PLOTS FOR SALE
★ ఉగ్లాపూర్ నుండి తర్శులపాడు 80 ఫీట్ల రోడ్డుకు అనుకొని North & East 155 గజాల ప్లాటు అమ్మబడును. 1 గజం 9,999/- ఆఫర్. రిజిస్ట్రేషన్ ఫ్రీ. సంప్రదించండి సిరి - 6301613156
AJW-177958

SITUATION VACANT
★ Urgently Required AC Technicians and Helpers at Warangal. AC Technician Training also available. Age Limit 18 to 25 Contact : 9989292396
AJH-01555

PLOTS FOR SALE
★ మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1 గజం భూమి యాదగిరిగుట్ట @ ఆలేరు జీడికల్లు రామాలయం - ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో స్పాట్ రిజిస్ట్రేషన్, 100% వాస్తు. సంప్రదించండి 9030769178
AJW-177947

బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును
★ HNK గోపాల్‌పూర్ కల్లు మండవ దగ్గర మేయిన్ రోడ్ 6950 Sft. గల బిల్డింగ్ సెల్లార్, లిఫ్ట్, కమర్షియల్, బ్యాంకులకు, హాస్పిటల్స్‌కి, కాలేజీలకి కిరాయికి ఇవ్వబడును. సంప్రదించండి 9866037006
AJW-177969

LAYOUT PLOT FOR SALE
★ మడికొండ, కపిల్ హోమ్స్ నందు ప్లాట్ నెం. 668 గలది 267 చ॥గ॥ల కుడా లేఅవుట్ ప్లాటు అమ్మబడును. గజం ధర కేవలం రూ॥ 25,000/-. సంప్రదించండి 8179520013
AJW-159702

HONDA ACTIVA FOR SALE
★ Honda Activa, 4G, 2018 Model, Good Condition గలది అమ్మబడును. 16,000 కి.మీ. తిరిగినది, ధర కేవలం రూ॥ 50,000/-. సంప్రదించండి 8179520013
AJW-159703

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273 8341725534
వరంగల్ 9985406505 9985406150
జనగామ 9866431354
మహబూబాబాద్ 9849814336
భూపాలపల్లి 9985401232
తొర్రూర్ 9985408003
పరకాల 9985411677
నర్సంపేట 9985418040